క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత పట్టణంగా పాలకొల్లు


ర్యాలీలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాజు

పాలకొల్లు అర్బన్: ప్లాస్టిక్ రహిత పట్టణంగా పాలకొల్లును తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సబ్ కలెక్టర్ దాసి రాజు కోరారు. ఫిబ్రవరి 1 నుంచి పట్టణంలోని ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తున్నట్టు రాజు తెలిపారు. పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో వర్తకులు, ఛాంబర్ ప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఓటర్ల దినోత్సవం

పాలకొల్లు అర్బన్: స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ హైస్కూల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ ఒక ప్రకటనలో విడుదల చేశారు.

భూ వివాదాల పరిష్కారానికి దోహదం

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన రీసర్వేతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని మొగల్తూరు తహసీల్దార్ కె రాజాకిషోర్ అన్నారు. మొగల్తూరు మండలం కేపీపాలెం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్యేలు తదితరులు ఉన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన పలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి కోరారు. శుక్రవారం మొగల్తూరు సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ముత్యాలపల్లి, మొగల్తూరు, కెపిపాలెం సౌత్, రామన్న పాలెం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ చెప్పారు.

వార్డుల్లో పారిశుద్ధ్య పనులు


నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన 3, 7, 17 వార్డుల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ప్రతిరోజూ డ్రెయిన్లను బాగు చేయాలన్నారు. రోడ్లపై చెత్త నిల్వ ఉండకుండా, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగ మంచు


పెనుమంట్ర మండలంలో పొగమంచు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో అన్ని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు దట్టమైన పొగ మంచు కమ్మేసింది. రోడ్లు, పొలాల్లో పొగ మంచు కమ్మేయడంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచు వల్ల వరి పంటకు తెగులు సోకడం, మామిడి పూతకు నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.

యూకేఎస్‌సీ ఆర్థిక సాయం


మాలశ్రీకి సాయం అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని గుత్తులవారిపేటకు చెందిన రోగ పీడితురాలు వాస్తేరు మాలశ్రీకి యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ గవర్నర్ పెనుమాక రామమోహన్‌రావు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, కానూరి ప్రభాకర్, గుండుమోగుల వీరాస్వామి, గంధం ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పరిశీలన

పెనుగొండ: పెనుగొండలోని నగరేశ్వర స్వామి కాలనీ, కోడి పందేల దిబ్బల్లో చేపట్టిన రహదారుల నిర్మాణాలను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్క శ్యామలాసోనీ శాస్త్రి, పంచాయతీ సభ్యుడు పులిగోరి రవికుమార్, నాయకులు వేంద్ర రాము, కుడిపూడి శ్రీను, గుత్తుల శివ, షేక్ సుజాయుద్దీన్‌లు పాల్గొన్నారు.

అడుగడుగునా గోతులు.. ప్రయాణానికి అవస్థలు

- గ్రామాల పరిధిలో ప్రమాదభరితం
- తారురోడ్డు వద్ద సిమెంటుతో మరమ్మతులు
- ఆయా ప్రాంతాల వద్ద కొన్ని రోజులకే ఛిద్రం


చిట్టవరం, నరసాపురం ప్రాంతంలో పలుచోట్ల హైవే గోతులు, కాంక్రీటుతో పూడ్చిన దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గ పరిధిలోని 216 జాతీయ రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. వీటితో రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నరసాపురం – పాలకొల్లు రోడ్డులో చించినాడ బైపాస్ వద్ద నుంచి ఉన్న ఈ రహదారి నరసాపురం ప్రాంతంలో అడుగడుగునా భారీ గోతులు ఏర్పడ్డాయి. నరసాపురం మండలం చిట్టవరం, సరిపల్లి, సీతారామపురం, రుస్తుంబాద గ్రామాల్లోని జాతీయ రహదారి పొడవునా ఉన్న గోతులను వెంటనే పూడ్చాలని పలువురు స్పందన కార్యక్రమంలో ఆర్డీఓకు వినతులు అందజేశారు. నరసాపురం మండలంలో రాజుగారితోట పంచాయతీ సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ ద్వారా వాహనదారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. అయితే ఎట్టకేలకు గత కొంత కాలంగా ఈ గోతులు పూడ్చే పనులు ప్రారంభించినప్పటికీ, ఈ విషయంలో జాతీయ రహదారుల శాఖ అంతగా పట్టించుకున్న దాఖలాలు లేదు. తూతూ మంత్రంగా మాత్రమే మరమ్మతు పనులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జాతీయ రహదారి తారు రోడ్డు గోతులకు కూడా సిమెంటుతో మరమ్మతులు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. చాలాచోట్ల సిమెంటు పోసి మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే రోడ్లు పాడై ఛిద్రంగా మారాయి. ఆ గోతులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయ. దీనిపై ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా వారి నుంచి స్పందన కరువైంది. తక్షణం అధికార యంత్రాంగం స్పందించి జాతీయ రహదారిపై గోతులను నాణ్యతా ప్రమాణాలతో పూడ్చించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

టోల్ వసూలుపైనే శ్రద్ధ



జాతీయ రహదారులపై టోల్స్ వసూలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడంలో లేకపోవడం దారుణం. ఏ చిన్న కార్యక్రమం అయినా ప్రభుత్వాలు ఆర్భాటాలుగా హడావుడి చేస్తున్నాయే తప్ప వాస్తవ పరిస్థితిని గుర్తించి పనులు చేయాలి. ఈ రోడ్లపై ప్రమాదాలు జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

– కదలి ఆదినారాయణ, లక్ష్మణేశ్వరం

ప్రమాదాలను అరికట్టాలి



216 జాతీయ రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నరసాపురం నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న గోతులు ప్రమాదకరంగా మారాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హైవే గోతులను తక్షణమే పూడ్చించాలి. లేకపోతే అనేక మంది మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

– ఉంగరాల రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ

వ్యవసాయ అధికారుల తనిఖీలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసా సహకారా సంఘాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఏకకాలంలో నరసాపురం ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, ఏఓ సామ్యూల్ జాన్సన్, ఏఈఓ లక్ష్మీనారాయణలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతాంగం తగిన సమయంలో కావాల్సిన మోతాదులో ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు.

ప్రమాదకరంగా వంతెన మార్గం

నరసాపురం: స్థానిక రుస్తుంబాధలో మంగళగుంట పాలెంకు వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ రాళ్లు పైకిలేచి పోయాయి. రోడ్డు శిథిలమైంది. ఈ నేపథ్యంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక 100 పడకల ఏరియా ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనమాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందడం లేదని తెలిపారు. ప్లేట్‌లెట్స్ పడిపోయిన రోగులను ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్యుల పోస్టులు కూడా పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు శ్రీనివాస్ తెలిపారు.

పంట బోదె తవ్వకం పనులు


పంట బోదెను తవ్వుతున్న ఉపాధి కూలీలు

నరసాపురం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు మొగల్తూరు మండలంలోని ముమ్మరంగా సాగుతున్నాయి. తూడు తొలగింపు, పంట బోదెల తవ్వకం తదితర పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మొగల్తూరు పంచాయతీ పెదపల్లవపాలెం నుంచి కొత్తకాయల తిప్ప వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర పంట బోదెలో పేరుకు పోయిన మట్టి మేటలను తొలగించారు. ఈ పనులు పూర్తయితే శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. పలు గ్రామాల్లో చేపట్టిన పంట బోదెల తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయని జేఈ ఆనంద్ తెలిపారు.

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన గొల్లపల్లి


ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

యలమంచిలి: యలమంచిలి ఇన్‌చార్జి ఎంపీపీగా గొల్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత సమక్షంలో సంతకం చేసి పదవి స్వీకరించారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. ఆ పార్టీకి చెందిన యలమంచిలి ఎంపీటీసీ సభ్యురాలు రావూరి వెంకటరమణ, ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మి ఎంపీపీ స్థానాన్ని చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం మేరకు ముందు రెండున్నరేళ్లు ఎంపీపీగా పని చేసిన రావూరి వెంకటరమణ గతేడాది మార్చి నెలలో రాజీనామా చేశారు. అనంతరం ఎలక్షన్ కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో అప్పటి నుంచి ఎంపీపీ ఎన్నిక జరగలేదు. ఇన్‌చార్జ్ ఎంపీపీని నియమించలేదు. వెంకటరమణ ఎంపీపీగా ఉన్న సమయంలో కనకాయలంక ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి శ్రీనివాసరావు వైస్ ఎంపీపీ–1గా, దొడ్డిపట్ల ఎంపీటీసీ సభ్యుడు కొప్పాడి శ్రీనుబాబు వైస్ ఎంపీపీ–2గా ఉన్నారు. దీంతో పార్టీ నాయకులంతా కలిసి వీరిద్దరిలో ఒకరిని ఎంపీపీగా నియమించి, త్వరితగతిన ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని కోరుతూ కలెక్టర్‌ను పలుమార్లు కోరారు. ఎట్టకేలకు వైస్ ఎంపీపీ–1 స్థానంలో ఉన్న గొల్లపల్లి శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీలు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌ల సూచనలతో అధికారుల సహకారం తీసుకుని మండలాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు వినుకొండ ధనలక్ష్మీ రవికుమార్, నల్లి సంధ్యారాణి, కంబాల సత్యశ్రీ, ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, చిలుకూరి రాజ్యలక్ష్మి సర్పంచ్‌లు కవురు గోపి, వల్లభు సాయి వెంకట నరసింహరావు, పాలంకి శ్రీనివాసరావు, కామిశెట్టి సాయిబాబు నాయకులు చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య), ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, మోకా నరసింహరావు, విప్పర్తి నవీన్, మామిడిశెట్టి చిట్టిబాబు, గుడాల సురేష్, లంక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న సర్పంచ్ సోనీ

పెనుగొండ: రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి తెలిపారు. పెనుగొండ శివాలయం వీధిలో పంచాయతీ నిధులతో రహదారి నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి టి రత్నాకరరావు, ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి, పంచాయతీ సభ్యులు వెలగల శ్రీనివాస రెడ్డి, పులిగోరు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పశువులకు రక్ష


బాడవలో పశు వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ వీర వెంకట కనకదుర్గ

యలమంచిలి: వైద్య శిబిరాలు పశువులకు రక్ష అని బాడవ సర్పంచ్ రాయి వీర వెంకట కనకదుర్గ అన్నారు. యలమంచిలి మండలం ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో శుక్రవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను సర్పంచ్‌లు ఈద ప్రమీల, రాయి వీర వెంకట కనకదుర్గలు ప్రారంభించారు. 80 పశువులకు, 103 గొర్రెలు, మేకలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్టు ఏఓ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ శిబిరాలకు పశు సంవర్ధక సహాయకులు జాజిమొగ్గల హేమలత, భానుమూర్తి, నిల్లా కోట సత్యశ్రీ, సతీష్, తరుణ్, దుర్గా భవాని, దొరబాబు, వెంకన్నబాబు, జగన్, సనంద సహకరించారు. బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం గ్రామాల్లో శనివారం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని డాక్టర్ చంద్రశేకరరెడ్డి తెలిపారు.

మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ


విద్యార్థులకు మోడల్‌టెస్ట్ పేపర్లు అందిస్తున్న మురళి, తదితరులు

పోడూరు: పాలకొల్లు పీఎల్‌కే హైస్కూలులో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్‌టెస్ట్ పేపర్లను దాత, విజయల్యాబ్ అధినేత మురళి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళి మాట్లాడుతూ చదువుతోనే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. పీఎల్‌కే పాఠశాల విశ్రాంత హెచ్‌ఎం వెంకటలక్ష్మి ప్రోత్సాహంతో ఈ టెస్ట్ పేపర్లు అందజేసినట్టు చెప్పారు. రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటలక్ష్మి మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీప్రియ, యూటీఎఫ్ ట్రెజరర్ ముద్దాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పి.అనిల్‌కుమార్, చీకట్ల వెంకట్రావు, పీవీవీ దక్షిణామూర్తి, ఆర్‌ఆర్ కీర్తన, బి.అమర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ అమలు చేయండి

నరసాపురం రూరల్: పంచాయతీల్లోని ఈ–పంచాయతీ కంపూటర్ ఆపరేటర్లకు (డీటో) మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మంగళగిరి జనసేన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌కు ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. సుమారు 400 మంది కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెలా జీతాలు సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు వేల మంది డీఈఓలు ఉన్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినట్టు ఆపరేటర్లు పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏడుకొండలు, జిల్లా అధ్యక్షుడు గుత్తుల వాసు, హేమ, చెన్నారావు తదితరులు ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పాలకొల్లు అర్బన్: బాలికలు చదువుకుంటే వారి భవిష్యత్తుకి బంగారు బాటలు వేసుకోగలరని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రిని ఆమె అందజేశారు. ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

ఫాగింగ్ ముమ్మరం

పెనుగొండ: పెనుగొండలో దోమల నివారణకు ఫాగింగ్ ముమ్మరం చేశారు. పెనుగొండ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం మెయిన్ రోడ్డు, జవ్వాది వారి వీధి, చెరుకువాడల్లో దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు, స్ప్రేయింగ్ చేశారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా, ప్లాస్టిక్ వస్తువులు బయట లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కొత్త వరి వంగడాల సాగు లాభదాయకం


ఉల్లంపర్రులో ఎస్‌ఎల్‌ఆర్ 3238 రకం వరిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

పాలకొల్లు అర్బన్: కొత్త వరి వంగడాల సాగు రైతుకి లాభదాయమని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఉల్లంపర్రులో ఆదర్శరైతు ఎంఎస్ వాసు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న కొత్త వరివంగడం ఎస్‌ఎల్‌ఆర్ 3238 రకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కొత్త వరి వంగడం అత్యధిక జింకు పోషకం కలిగి ప్రజలు తినడానికి అనువైన మధ్యస్థ సన్నరకమని తెలిపారు. అనంతరం శివదేవునిచిక్కాలలో మినీ కిట్‌గా సాగు చేసిన కొత్త వరివంగడం ఆర్ఎన్ఆర్ 15048 రకాన్ని కూడా పరిశీలించారు. రైతు తాళ్లూరి శ్రీనివాస్‌కి పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడీఏ అడ్డాల పార్వతి, ఏఓ కె.రాజశేఖర్, టెక్ ఎంఏఓ ప్రియదర్శిని తదితరులు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఈ–పంట నమోదు

పోడూరు: క్షేత్ర స్థాయిలో నిబంధనలకు అనుగుణంగా ఈ–పంట నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. రైతు దశిక రామ్మోహనరావు పాలంలో ఎంటీయూ –1426 చిరుసంచి ప్రదర్శనను సందర్శించారు. పోడూరులో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో జిల్లా వ్యవసాయాధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడీఏ ఎ.పార్వతి, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, దశిక రామ్మోహనరావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడితే అనర్థం

పెనుగొండ: మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే దుష్ఫలితాలు వస్తాయని ఆచంట మండల వ్యవసాయాధికారి బి నాగరాజు తెలిపారు. ఆచంట మండలం వంకతాళ్ల చెరువులో మోతాదుకుమించి ఎరువుల వాడకం వల్ల కుళ్లిపోయిన వరిచేనును ఆయన పరిశీలించారు. దాళ్వా సాగులో సిఫారుసు చేయబడిన విధంగా 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24కిలోల పోటాష్‌లను, మరియు కాంప్లెక్స్ ఎరువులను వేసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం


నూకయ్యకు సాయం అందిస్తున్న స్నేహితులు

పెనుగొండ: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న స్నేహితుడుకి మేమున్నామంటూ పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధ పడుతున్న కొఠాలపర్రుకు చెందిన ఉండ్రాజవరపు నూకయ్యకు తనతో 1995–96 విద్యా సంవత్సరం దేవ ఎస్‌ఎం బీటీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన స్నేహితులు రూ.1,12,000 సాయం అందజేశారు. శుక్రవారం కొఠాలపర్రులోని ఆయన నివాసంలో నూకయ్యను కలిశారు. స్నేహితులను ఏకత్రాటిపైకి తీసుకొచ్చిన ములపర్రుకు చెందిన బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు బీవీ రమణ మాట్లాడుతూ కష్టల్లో ఉన్న స్నేహితులకు అండగా ఉంటున్నట్టు చెప్పారు.

బాలికా విద్యతో సమాజాభివృద్ధి


మార్టేరులో మానవహారం నిర్వహిస్తున్న బాలికలు

పెనుమంట్ర: బాలికల విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక సంరక్షణ దినోత్సవం సందర్భంగా పెనుమంట్రలో బేటీ బచావో – బేటీ పడావో ర్యాలీ, మార్టేరు సెంటర్‌లో బాలికల మానవహారం నిర్వహించారు. పెనుమంట్ర, మామూడూరు, నెగ్గిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో కృష్ణకుమారి మాట్లాడారు. బాలికల విద్య, ఆరోగ్య సంరక్షణకు అమలు చేసే పథకాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ ఎం మల్లిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లోనూ రాణించాలి

పాలకొల్లు అర్బన్: బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. ఏవీఎస్ఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌స్టాప్ సెంటర్ లీగల్ అడ్వయిజర్ పి దుర్గ, హెచ్‌ఎం ఎం సురేష్, సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

- జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, శివదేవునిచిక్కాల జిల్లా పరషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు.

విద్యతోనే బాలికలకు మంచి భవిష్యత్తు

పోడూరు: విద్యతోనే బాలికలకు మంచి భవిష్యత్తు ఉంటుందని పెనుమదం హెచ్‌ఎం సీహెచ్‌వి సురేష్‌బాబు అన్నారు. పెనుమదం జెడ్పీహైస్కూల్లో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

బాలికల చేతుల్లోనే భవిష్యత్తు

యలమంచిలి: మేడపాడు హైస్కూల్లో బాలికలతో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుని శారీరికంగా, మానసికంగా బలంగా ఉండాలని సూచించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నరసాపురం రూరల్: నరసాపురం, మొగల్తూరు మండలాల్లో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, పౌష్టికాహారం, రక్తహీనత, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మొగల్తూరు, తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిట్టవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.